ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠామహోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఈటల రాజేందర్

అల్వాల్: మచ్చబొల్లారం గ్రామంలో శుక్రవారం నాభిశిల 'బొడ్రాయి' ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రుత్వికులు రాహుల్ శర్మ, సాయిదత్తు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ దంపతులు, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం యాదవ్ దంపతులు, మాణిక్యరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



మేడ్చల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు, సరస్వతి, మల్లికార్జున్ ముదిరాజ్, హంసరాణి, నాయకులు కృష్ణ, రవీందర్‌గౌడ్, సురేందర్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన విద్యార్థులు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శుక్రవారం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్లిన విద్యార్థి బృందం అక్కడ రాష్ట్రపతికి కల్పించే వసతులు, భద్రత తదితర విషయాలను తెలుసుకున్నారు. అంతకుముందు కళాశాల సెక్రటరి టీవీ రెడ్డి, డైరెక్టర్ సరోజరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్ విద్యార్థుల బృందం వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో అసం, రాజేశ్ పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న జనగాం మహేందర్‌భూపతి

కీసర: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కీసర మండల అధ్యక్షుడిగా బోగారం గ్రామానికి చెందిన జనగాం మహేందర్‌భూపతిని నియమించారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మహ్మద్ షఫీయుద్దీన్ శుక్రవారం జనగాం మహేందర్ భూపతికి నియామకపత్రం అందజేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీఎంహెచ్ఓ డాక్టర్.రఘునాథస్వామి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ రఘునాథ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన జిల్లాస్థాయి కమిటీ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గౌరవ వేతనం ప్రాతిపదికన ఏడు ట్యూటర్, 22 సీనియర్ రెసిడెంట్ల పోస్టుల నియామకానికి అర్హులైన వారి నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సముదాయాల్లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తుతో అవసరమైన సర్టిఫికెట్ల కాపీలను జత చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 15 నుంచి పోస్టులు భర్తీ అయ్యే వరకూ కలెక్టరేట్‌లోని డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరు కావాలని ఆయన కోరారు. వాకిన్–ఇంటర్వ్యూ ద్వారా రోజు వారీగా అభ్యర్థుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసు నియామక పత్రాలు అందజేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పోలీసు ఉద్యోగాలకు ఎంపికై ఎంక్వైరీలో కేసులు ఉన్నాయని తేలడంతో 250 మంది అభ్యర్థులు నియామకాలు నిలిచిపోయాయని పలువురు అభ్యర్థులు శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. గ్రామాల్లో చిన్నా చితక గొడవలకు, ఇతర కేసులలో నిర్దోషులుగా కోర్టులు తీర్పు ఇచ్చినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటినుంచి కూడ వివిధ శాఖల మంత్రులతో పాటు టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్‌ను సైతం కలసి సమస్యను చెప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామకాలను నిలిచిపోయయి అని వెంటనే నియామకపు ఉత్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.



రావల్‌కోల్ గ్రామ పరిధి గూడెంగడ్డ తండాలో అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలు.

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- వందలాది టిప్పర్లలో రవాణా
- రాత్రి వేళలో జోరుగా తరలింపు
- ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- అధికారుల అండదండలు పుష్కలం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తోడేస్తున్నారు..

మేడ్చల్ మండలంలో కొద్ది రోజులుగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి అయితే చాలు అన్నట్లు నిత్యం మట్టి వ్యాపారులు ప్రభుత్వ భూములు, ఇతర భూముల్లో రాత్రికి రాత్రే తవ్వకాలు జరుపుతూ రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నారు. వందలాది టిప్పర్లలో రాత్రి వేళలో మట్టి తరలిస్తున్నారు. నిత్యం గ్రామాల్లో తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది తమకేం తెలియదన్నట్లు వ్యవహరిస్తుండటంతో వారి అండదండలతోనే వ్యాపారులు దర్జాగా తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

– మేడ్చల్‌రూరల్

మండలంలోని రావల్‌కోల్, కోనాయిపల్లి, బండమాదారం, రాజబొల్లారం, నూతన్‌కల్, శ్రీరంగవరం, మైసిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మట్టి వ్యాపారులు ఆయా గ్రామాల్లో ప్రధానంగా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపడుతుండగా మరికొన్ని చోట్ల బీడు భూములు, రైతుల పొలాలను తవ్వకాలకు తీసుకుని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్తంభం లోతు వరకు ఇటాచీ వాహనాలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ వ్యాపారులు రూ.లక్షలు గడిస్తున్నారు. మరికొందరు రాత్రిళ్లు తవ్వకాలు జరిపి ఓ చోట డంపింగ్ చేసుకుని పగటి వేళల్లో అమ్మకాలు జరుపుతున్నారు.

చీకటి పడితే చాలు..

మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. చీకటి పడితే చాలు అన్నట్లు వ్యవహరిస్తూ సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు తవ్వకాలు జరుపుతూ రాత్రంతా వాహనాల్లో మట్టిని తరలించుకుపోతున్నారు. ఇక ప్రధానంగా వారాంతపు సెలవు దినాలను ఆసరా చేసుకుని శని, ఆదివారాల్లో మరింత రెచ్చిపోతున్నారు. వారాంతపు రోజుల్లో అయితే మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండరని ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు ఉండరని భావించి తమ వ్యాపారం సాగిస్తున్నారు. ఇక రెవెన్యూ శాఖలో వీఆర్ఏ వ్యవస్థ రద్దు కావడం వీరికి మరింత అనుకూలంగా మారింది.

సిండికేట్‌గా మారి వ్యాపారం..

మండలంలోని మట్టి వ్యాపారులు సిండికేట్‌గా మారి జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు. మండలంలోని రావల్‌కోల్, రాజబొల్లారం, గోసాయిగూడ వంటి జాతీయ రహదారికి ఓ వైపు ఉన్న గ్రామాలకు మునీరాబాద్ గ్రామానికి చెందిన ఓ మట్టి వ్యాపారి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తుండగా మరికొందరు భాగస్వాములుగా చేరి వ్యాపారాన్ని మూడుపువ్వులు, ఆరు కాయలు అన్నట్లు సాగిస్తున్నారు. ఇక రాయిలాపూర్, బండమాదారం, శ్రీరంగవరం, నూతన్‌కల్, కోనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి గ్రామాల వైపు ఉన్న మరికొందరు వ్యాపారులు సైతం ఇదే తరహాలో దందా సాగిస్తున్నారు.

సిబ్బంది అండదండలతోనేనా..?

మట్టి వ్యాపారులకు రెవెన్యూ శాఖలోని కిందిస్థాయి అధికారుల అండదండలు ఉండటంతోనే మండలంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గ్రామాల్లో నిత్యం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నా రెవెన్యూ శాఖ వాటిని నియంత్రించడం, మట్టి వ్యాపారులపై చర్యలు తీసుకోవడం, వాహనాలను సీజ్ చేయడం వంటి చర్యలకు పాల్పడకపోవడంతో పాటు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మట్టి వ్యాపారులు–సిబ్బందికి మధ్య సత్సంబంధాలు ఉండటం వల్లే ఎలాంటి అనుమతులు లేకున్నా అడ్డు చెప్పకుండా తమకు ఈ వ్యవహారం తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు



మండలంలో మట్టి తవ్వకాలను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. కొంతమంది వ్యాపారులు రాత్రి వేళలో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. తమ శాఖలో వీఆర్ఏ వ్యవస్థ రద్దు, సిబ్బంది కొరత కారణంగా కొంత ఇబ్బంది కలుగుతోంది. గ్రామాల్లో ఎవరైనా మట్టి తవ్వకాలు జరిపితే గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. తమ సిబ్బంది అండతో తవ్వకాలు సాగుతున్నయనే ఆరోపణ అవాస్తవం. అక్రమంగా మట్టి వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుని వాహనాలను సీజ్ చేస్తాం.

– శైలజ, తహసీల్దార్, మేడ్చల్

వసూళ్లకు పాల్పడుతున్న యూట్యూబర్‌పై కేసు

ఘట్‌కేసర్: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న 3ఎస్ న్యూస్ యూట్యూబర్‌పై కోర్టు ఆదేశానుసారం ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకుషాపూర్‌కు చెందిన కన్నబోయిన రమేశ్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్ సీహెచ్ఎల్ఆర్ ఫంక్షన్ హాలు సమీపంలో మున్సిపల్ అధికారుల అనుమతితో 190 గజాల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. కీసర రాంపల్లికి చెందిన దినేశ్‌కుమార్ గత నెల 31న రమేశ్ నిర్మిస్తున్న ఇంటి దగ్గరికెళ్లి 3ఎస్ న్యూస్ చానల్ అంటూ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. లేదంటే ఇంటిని కూల్చివేయిస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు రమేశ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కోర్టు ఆదేశానుసారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

శామీర్‌పేట్: పెయింటింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన లక్ష్మయ్య(50) పెయింటర్. శామీర్‌పేటలోని నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ భవనంలోని రెండవ అంతస్తులో గురువారం పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం మెడిసిటీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామాన్య కార్యకర్తగా పనిచేస్తా

పోచారం: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఘట్‌కేసర్ మండల కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బూత్ కమిటీలలో పాత వారితో పాటు కొత్త వారికి అవకాశం కల్పిస్తూ తుది జాబితాను తయారు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా నవ నాగ మానసా దేవి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మానంద భారతి స్వామి

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీ శివాంజనేయ, స్వయంభు యోగలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నవ నాగ మానసా దేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆత్మానంద భారతి స్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ శివ కార్తీక్ శాస్త్రి దేవతామూర్తుల యంత్ర ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, కలష ఉద్వాసన, ఆలయ సంప్రోక్షణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ నాయకురాలు ఈటల జమున ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గట్టమనేని సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చల్లా ప్రభాకర్, గణేష్ ముదిరాజ్, హనుమంతు, కాసుల సురేందర్‌గౌడ్, సహదేవ్‌గౌడ్, లక్ష్మణ్, వెంకులు, జ్యోతిరెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో చర్చించినా అంతే..

- అభివృద్ధికి నోచుకోని నల్ల చెరువు
- పట్టించుకోని అధికారులు



ఉప్పల్ నల్ల చెరువులో గుర్రపు డెక్క

ఉప్పల్: పాలకులు, ప్రభుత్వాలు మారినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఉప్పల్ నల్ల చెరువుపై గత ప్రభుత్వం వివక్ష చూపగా, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అదే పరిస్థితి నెలకొంది. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువులను కాపాడతామని, సుందరీకరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రకటించినా పనులు మాత్రం అంగుళం కూడా ముందుకు సాగడం లేదు. చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయింది. చెరువు కలుషితం కావడంతో ఎదురవుతున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఏకంగా అసెంబ్లీలో ప్రస్తావించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో దాదాపుగా అన్ని చెరువుల పరిస్థితి ఇదేలా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కీసర: మండల కేంద్రమైన కీసరలో ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కీసరగుట్ట రహదారిలో కొత్తగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ఎల్లమ్మతల్లి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహాపూజ తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పెదమ్మ తల్లి కల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున బోనాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, శాసన మండలి ఉపసభాపతి బండ ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ నేతలు తోటకూర వజ్రేష్‌యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున, ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగయ్య, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాధురివెంకటేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, టి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

14న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో ఈ నెల 14న ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు కాప్రా నగర బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రతినిధి కేకేబీఏ శర్మ తెలిపారు. 30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సారి 25 వ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9985795760 లో సంప్రదించాలన్నారు.

ఘనంగా శ్రీ రామనవమి నవరాత్రి ఉత్సవాలు



సామూహిక కుంకుమార్చన

అల్వాల్: సీతారామ నామ సంకీర్తన సంఘం అల్వాల్ ఆధ్వర్యంలో శ్రీ రామనవమి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం హరిదాసు మండపంలో సామూహిక అష్టోత్తర శతనామార్చన, విజయవల్లి భరద్వాజ్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.

14న వేంకటేశ్వర స్వామి కల్యాణం

మల్కాజిగిరి: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధార్మిక పరిషత్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఫణిభూషణ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న ఫణిభూషణ్

ఉప్పల్: భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్(ధార్మిక పరిషత్) తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఫణిభూషణ్ చింతపల్లిని నియమిస్తూ కన్వీనర్ సూర్యప్రకాశ్ శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫణిభూషణ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తిస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఎండోమెంట్ సెల్ ప్రతినిధులకు, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మల్కాజిగిరి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిస్తేనే ఢిల్లీలో నిలదీయగలుగుతామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కెనగర్‌లో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులతో పాటు, ఉద్యమకారుల సహకారంతో మెజారిటీ ఓట్లతో గెలుపొందామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ అవకాశమిచ్చిందని మీ అందరి సహకారం కావాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నానని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేల మంది ప్రజలకు సేవ చేసే అవకాశం కల్గిందన్నారు. ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తీసుకురావడం కీలకమని, నాయకులు దాని పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

కుషాయిగూడ: స్టామ్ వాటర్ పైప్‌లైన్‌తో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ తెలిపారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, ఎన్‌టీఆర్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో స్టామ్ వాటర్ పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచుతూ చేపట్టిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైప్‌లైన్ సామర్థ్యం తక్కువగా ఉన్నందున తరచూ పొంగి పొర్లడంతో మురుగు నీటి వ్యర్థాలు రోడ్డుపైకి వచ్చి ఇబ్బందులు పడేవారన్నారు. ఈ క్రమంలో స్టామ్ వాటర్ పైప్‌లైన్ సామర్థ్యం పెంపు ప్రతిపాదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట స్థానిక నేతలు శేఖర్‌గౌడ్, దండెం నరేందర్ ఉన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

ఒంటరి మహిళలే టార్గెట్

- చైన్ స్నాచర్ అరెస్టు..
- 6.7 తులాల బంగారు ఆభరణాలు
- బైక్ స్వాధీనం..

కుషాయిగూడ: ఒంటరిగా తిరిగే మహిళలను టార్గెట్ చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తిని కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి 6.7 తులాల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కుషాయిగూడ ఏసీపీ టీ మహేష్, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ జి. వీరస్వామితో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా, హనుమకొండ, ఇందిరానగర్‌కు చెందిన పుట్ట హరికృష్ణ కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి డ్రైవర్‌గా పని చేస్తూ చెంగిచర్లలో నివాసం ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన అతను డబ్బులు కోసం చోరీల బాటను ఎంచుకున్నాడు. రోడ్లపై ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్ చేసుకుని బైక్‌పై వెళ్తూ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. తద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు.వారం రోజుల క్రితం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనర్సింహ్మకాలనీలో రోడ్డు వెళ్తున్న రూప అనే మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుడు హరికృష్ణను గుర్తించారు. శుక్రవారం చెంగిచర్లలోని అతడి ఇంటి సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించాడు. అతను గతంలోనూ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడని, కీసర, సైదాబాద్ పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. అతడి నుంచి 6.7 తులాల మూడు బంగారు నగలు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసును చేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, డిఐ రాజు, ఎస్ఐ ఉపేందర్‌యాదవ్, సిబ్బందిని ఆయన అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్ వీరస్వామి